క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 6 నుంచి 8 గంటల వరకు ..
ఆఫీసర్స్ మెస్, డాన్ స్కూల్, బీబీ కేన్సర్ హాస్పిటల్, ఇబ్రహీం ఫంక్షన్‌హాల్, దయానగర్, మెరిడియన్ ఫంక్షన్‌హాల్, మలక్‌పేట రోడ్ పరిసరాలు..

ఉదయం 8 నుంచి 10 గంటల వరకు...
కుర్మగూడ శ్రీ టెంపుల్, శాంతినగర్, ఉప్పర్ బస్తీ, గౌసియా మసీద్, అజంపురా మీటర్‌వాడి, బ్యాంక్ కాలనీ, అజంపురా కాంటా, డీసీ పటేల్ కాలనీ, ఫరత్‌నగర్ టెంపుల్, డబీర్‌పురా దర్వాజా, డబీర్‌పురా పీఎస్, నాగబౌలి, బిబిసాబ్ బంగ్లా, అరబ్‌గల్లీ, పెంటయ్య బ్యాండ్, టీబీ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 19, వంకాయ 35, బెండ 26, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, క్యారెట్ 37, దొండ 15, ఆలు 19, ఉల్లి 13, గోకర 45, దోస 18, సొర 15, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 65, ఆర్వి 35, మునగ 48, చిలగడదుంప 50, బీట్‌రూట్ 19, కీర 19, ఫ్రెంచ్ బీన్స్ 70, కాప్సికమ్ 55. ఆదివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి రూ 3.15 కోట్లు మంజూరు



కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహకారంతో 3.15 కోట్ల రూపాయలు మంజూరు చేయించామని కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక వసతుల ఏర్పాటుకు తన శాయశక్తులా కృషి చేస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు, పెట్రోల్ పంపునకు ఎడమవైపు, కుడివైపు రోడ్డు నిర్మాణం, అనుపమానగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 30 లక్షలు, వందనపురి కాలనీ, బాలాజీనగర్, శ్రీబాలాజీకాలనీ, వెంకటేశ్వరకాలనీ, ద్వారకానగర్ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి 86 లక్షల రూపాయలు, సాయిగణేశ్‌నగర్ కాలనీ నుంచి స్వాదత్తనగర్ కాలనీ వరకు సీసీ రోడ్డు పునరుద్ధరణకు రూ.కోటి 59 లక్షలు మంజూరు చేయించామని కార్పొరేటర్ సుజాతానాయక్ చెప్పారు. నిధులు మంజూరైన రోడ్ల నిర్మాణ పనులను అతి త్వరలోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభిస్తారని కార్పొరేటర్ తెలిపారు.

మలక్‌పేటలో 41 మంది పోలీసుల బదిలీ

మలక్‌పేట: నగర పోలీస్ కమిషనర్ ఈనెల 24న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మలక్‌పేట పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు ఎస్సైలు, ముగ్గురు ఏఎస్సైలు, 10 హెడ్ కానిస్టేబుళ్లు, 26 మంది కానిస్టేబుళ్లు..మొత్తం 41 మంది బదిలీ అయ్యారని ఇన్‌స్పెక్టర్ కెసవరాజు శ్రీనివాస్ తెలిపారు. అడ్మిన్ ఎస్సై సుభాష్, డీఎస్సై సాయితేజారెడ్డి బదిలీ అయ్యారు. అదేవిధంగా మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్సై రాముడునాయుడు బదిలీ కాగా.. ముగ్గురు ట్రాఫిక్ ఎస్సైలు ఇక్కడికి రానున్నారు. అంతకు ముందే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న భరోసా సెంటర్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

'సహభావన' సమస్యలు పరిష్కరించండి

రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శికి ఎమ్మెల్యే వినతి



ప్రత్యేక కార్యదర్శికి సహభావన టౌన్‌షిప్ సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: నాగోలు డివిజన్ బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్‌లోని సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్ర బోయిని తన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, సహభావన టౌన్ షిప్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, సెల్లార్లలో లీకేజీల కారణంగా దుర్గంధభరితంగా మారి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. టౌన్‌షిప్‌కు వెనుక వైపు ఉన్న జీఎస్‌వి గోడ కూలిపోవడంతో పాములు, ఇతర జంతువులు లోపలికి వస్తున్నాయని తెలిపారు. టౌన్‌షిప్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు ఓపెన్ జిమ్, అదనపు దీపాలు, కమ్యూనిటీహాల్ నిర్మించాలని కోరారు. స్పందించిన కార్యదర్శి.. సహభావన టౌన్ షిప్‌లోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు తూర్పటి చిరంజీవి, నాయకులు విశ్వేశ్వరరావు, రాధాకృష్ణ, యాదగిరి, వేంకటేశ్వర్లు, కృష్ణ, సాయిబాబా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తా



కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: డివిజన్‌లోని శ్రీనివాస కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని, కాలనీవాసులకు మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు శనివారం ఆయన కాలనీలో పర్యటించారు. కాలనీలో చాలా కాలం క్రితం వేసిన డ్రైనేజీ వ్యవస్థ ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో డ్రైనేజీ పొంగి రోడ్ల వెంట పారుతోందని, చాలా చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయని, మంచినీటిలో ప్రెషర్ సమస్య కూడా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి సూపర్‌వైజర్ బాలునాయక్ కాలనీ నాయకులు మాణిక్‌రెడ్డి, కృష్ణ, దర్మారెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీని తీసుకెళ్లాలి: వంగ



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: మహాజన్ సంపర్క్ అభియాన్ నినాదంతో ఇంటింటికీ బీజేపీని తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి, వనేపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ బీజేపీ కార్యాలయంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రధానిగా 9 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30 నుంచి జూన్ 30 వరకు నెల రోజుల పాటు పార్టీ కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సందీప్‌రెడ్డి, రమేష్‌గౌడ్, వీరారెడ్డి, దశరథగౌడ్, రాజేష్, పాశం శ్రీశైలం, రాంపురం రమేష్ పాల్గొన్నారు.

అజంపురాలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



పోలీస్ బందోబస్తుతో అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

చాదర్‌ఘాట్: అజంపురా పార్కు వద్ద ఉన్న అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 అధికారులు శనివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చేశారు. అక్కడ ఉన్న వ్యాపారులు కూల్చివేత పనులను అడ్డుకునేందుకు యత్నించడంతో కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. హోంమంత్రి మహమూద్ అలీ ఇంటికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో పార్కుకు చుట్టూ వ్యాపారులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారిందనే ఫిర్యాదులతో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అయితే అన్యాయంగా కూల్చివేతలు చేపట్టి తమకు జీవనోపాధి లేకుండా చేశారని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

చాదర్‌ఘాట్: చంచల్‌గూడ కాలడేరాలోని బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాలుగు రోజులు కొనసాగే ఉత్సవాల్లో 3వ రోజైన శనివారం చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం బస్తీ ఆడపడుచులకు ఒడి బియ్యం పోశారు. అమ్మవారి ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ కొత్త రాఘవేంద్రగౌడ్ దంపతులు పాల్గొన్నారు.

నెహ్రూ ఆశయ సిద్ధికి కృషి చేయాలి

చంపాపేట: భారత తొలి ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ ఆశయ సిద్ధికి నేటి యువత కృషి చేయాలని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా చంపాపేటలోని గాంధీ విగ్రహం చౌరస్తాలో నెహ్రూ చిత్రపటానికి శ్రీపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జూన్ 18న నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదగిరి, ఎం. నారాయణ, కిరణ్, శివ, చింటూ, రణధీర్‌రెడ్డి, యాదమ్మ, మాధవి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ మాజీ చైర్మన్ మృతి



హనుమంతరావుగౌడ్ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, చెలమల కృష్ణారెడ్డి

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయ మాజీ చైర్మన్, ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగాల హనుమంతరావుగౌడ్ శనివారం మృతి చెందారు. భౌతిక కాయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు చెలమల కృష్ణారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు సురేందర్‌రెడ్డి, నర్సింహయాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, పన్యాల జైపాల్‌రెడ్డి, రమేష్‌నాయక్ ఉన్నారు.

త్వరగా క్యాచ్‌పిట్ పనులు పూర్తి చేయాలి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ కోదండరాంనగర్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ క్యాచ్‌పిట్ పనులను శనివారం కార్పొరేటర్ బద్దం ప్రేం మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, క్యాచ్‌పిట్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు తరచూ పనులను పర్యవేక్షించాలన్నారు. కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది వెంకటేశ్, కాంట్రాక్టర్ సోహెల్, రఘునందన్ పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల పట్టివేత

చైతన్యపురి: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని సరూర్‌నగర్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. 9 బైకులను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసు కథనం ప్రకారం... సరూర్‌నగర్ గాంధీ విగ్రహ చౌరస్తాలో మిర్చీ స్టాల్ నడుపుతున్న బెగారీ మత్స్యేందర్, లింగోజిగూడ కామేశ్వరరావునగర్ కాలనీకి చెందిన మహమ్మద్ జమీల్ స్నేహితులు. జల్సాలకు అలవాటుపడ్డ ఇద్దరూ రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పార్కింగ్ చేసి ఉన్న బైకులను అపహరిస్తున్నారు. వాటిని తక్కువ ధరకే ఇతరులకు విక్రయించి, వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, పీఅండ్‌టీ కాలనీ చెందిన బరిగెల్ల నోహబిల్ గేట్స్ ఈనెల 25న తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్కు చేశాడు. తెల్లారి చూసేసరికి బైక్ కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం సరూర్‌నగర్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న మత్స్యేందర్, జమాల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బైకుల చోరీకి పాల్పడుతున్నట్టు వారు ఒప్పుకున్నారు. సంగారెడ్డి, మలక్‌పేట, చైతన్యపురి ప్రాంతాలలో తొమ్మిది ద్విచక్ర వాహనాలను అపహరించినట్లు వెల్లడించారు. పోలీసులు మూడు బైకులు, ఆరు స్కూటీలను స్వాధీనం చేసుకొని ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

కేటీఆర్ ప్రారంభించిన పనులకే దిక్కు లేదు: సామ



ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ అరుణ

లింగోజిగూడ: నాగోలు డివిజన్‌లో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించిన పనులకే దిక్కులేకుండా పోయిందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. డివిజన్‌లోని వెంకటరమణ కాలనీ, మమతానగర్‌ల్లో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ పనులను స్థానిక కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్‌యాదవ్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, ఎస్‌ఎన్‌డీపీ పనులను ప్రారంభించిన మంత్రి కేటీఆర్ ఆరు నెలలో పూర్తి చేస్తామని చెప్పారని, అయితే, 16 నెలలు అవుతున్నా ముందుకు సాగడం లేదని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో పనులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తమ ఘనతగా గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. నాలా పనులు మధ్యలో ఆగడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని, వచ్చే వర్షా కాలంలో మరోసారి తమకు ముంపు ముప్పు తప్పేలా లేదని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యేకు కాలనీల్లోని సమస్యలు పట్టడం లేదని, సమస్యలను గాలికొదిలేసి, ఎక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో కనిపెట్టే పనిలో ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



గవర్నర్ తమిళిసై నుంచి ట్రోఫీ అందుకున్న లింగాల హరిగౌడ్ టీం సభ్యులు

సైదాబాద్: ఖేలో భారత్ జీతో భాగ్యనగర్ పేరిట హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో క్రికెట్ విభాగంలో లింగాల హరిగౌడ్ యువసేన టీం విజేతగా నిలిచింది. శుక్రవారం రాత్రి నగరంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో హరిగౌడ్ టీమ్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం సైదాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ మాట్లాడుతూ, యువత ఎప్పటికప్పుడు తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉండేందుకు యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఖేలో భారత్ పోటీల్లో విజేతలుగా నిలిచిన తమ జట్టు సభ్యులను ఆయన అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా ఐఎస్‌సదన్ అభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో సీసీ రహదారుల నిర్మాణ పనులను కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సీవరేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అక్కడి పనులు పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లోనూ అక్కడి అంతర్గత రహదారులను ఆధునీకరిస్తామని తెలిపారు. తమ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానికులు తరుచూ పర్యవేక్షిస్తుండాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కాలనీ సంఘం సభ్యులు రమేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, రామిరెడ్డి, జైప్రకాష్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

అనాథ విద్యార్థుల భవిష్యత్‌కు సహకరిస్తా

జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి



అనాథ విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న కట్టా నర్సింహారెడ్డి దంపతులు

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థుల భవిష్యత్ కోసం అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం చిత్ర లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో శనివారం కట్టా నర్సింహారెడ్డి, కల్పనాదేవిల వివాహ వార్షికోత్సవాన్ని అనాథ విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ కోసం ఒక లక్ష్యంతో పనిచేసి తమ భవిష్యత్‌ను తీర్చి దిద్దుకోవాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన అవేర్ ఫౌండేషన్ చైర్మన్ మాధవన్ మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం అత్యున్నత ప్రమాణాలతో నడుస్తోందని, గృహంలోని కంప్యూటర్ లాబ్‌కు ఫౌండేషన్ తరఫున రూ. 50 వేలు అందజేశారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు దుస్తులు ఇచ్చి, విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సురేష్, రంజిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కుర్మగూడలో బీఎల్‌ఓల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ నరసింహ

చంచల్‌గూడ: యాకుత్‌పురా నియోజకవర్గ బీఎల్‌ఓల సమావేశం శనివారం కుర్మగూడలోని గ్రాండ్ ప్లాజా ఫంక్షన్ హాల్లో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన జీహెచ్‌ఎంసీ సర్కిల్–7 డిప్యూటీ కమిషనర్ నరసింహ ఓటర్ లిస్టు పరిశీలనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను బీఎల్‌ఓలకు వివరించారు. కాగా, నిరక్షరాస్యులను కూడా బీఎల్‌ఓలుగా నియమించారని, ఓటర్ల పరిశీలన పారదర్శకంగా జరగదని పలువురు సమావేశంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. సమావేశానికి ఎంఐఎం కార్పొరేటర్లు ముజఫర్ హుస్సేన్, వసీం, బీజేపీ నాయకులు వీరేందర్‌యాదవ్, కామాటి మహేష్, టీఆర్‌ఎస్ నేత నర్సింగ్‌రావు తదితరులు హాజరయ్యారు.



సార్లూ.. మురుగు సమస్యను పరిష్కరించరూ!



హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

సైదాబాద్: డ్రైనేజీలు నిండి రహదారులపై మురుగు పారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సైదాబాద్ హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని పలు డ్రైనేజీలు నిండి వారం రోజులుగా వాటిలోని మురుగు రహదారులపై పారుతూ ఇబ్బందులకు గురవుతున్నామని వారు తెలిపారు. మురుగు నుంచి వస్తున్న దుర్వాసనతో ఇళ్ల తలుపులు కూడా తీసుకోలేక అవస్థలు పడుతున్నామన్నారు. రహదారులపై మురుగు సమస్య స్పష్టంగా కనిపిస్తున్నా..దాని గురించి పలుమార్లు వినతులు ఇచ్చినా కాలనీ సంక్షేమ సంఘం, అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి రహదారులపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సైదాబాద్‌లో సీపీఐ నేతల ముందస్తు అరెస్ట్

సైదాబాద్: ప్రతిపక్షాల శాంతియుత నిరసనలను పోలీసులు అడ్డుకోవడం సరికాదని సీపీఐ ఐఎస్‌సదన్ డివిజన్ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. శనివారం బాలాపూర్‌లో నిరసనకు తరలివెళ్లడానికి నిర్ణయించుకున్న సీపీఐ నాయకులను సైదాబాద్ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి ఠాణాకు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మహమూద్ మాట్లాడుతూ, భూదాన్ భూముల్లో సీపీఐ నాయకులు గుడిసెలు వేయిస్తున్నారని అంటూ అరెస్ట్ చేయడం సమంజసం కాదన్నారు. అరెస్టయిన వారిలో ప్రజా సంఘాల నాయకులు గణనాయక్, పవన్‌నాయక్ ఉన్నారు.

మహిళలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సైదాబాద్: మహిళలు మాదకద్రవ్యాలకు, మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండాలని తరుణి సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మమతా రఘువీర్ అన్నారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన స్వాంతన సంస్థ కార్యాలయాన్ని రిటైర్డ్ జడ్జి అచంట సద్గురు ప్రసాద్, డాక్టర్ హేమలతాదేవి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ మమత మాట్లాడుతూ, నగరంలోనే మొదటిసారిగా మహిళల కోసం డీ అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సెంటర్‌లో మహిళలు మాదకద్రవ్యాల మత్తును వీడి మామూలు జీవనం సాగించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కృష్ణమూర్తి, మంజుల పాల్గొన్నారు.

